అవినీతికి పాల్పడి సొంత మేనిఫెస్టోనా..?

- ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు 'గంటా' ప్రయత్నం
- వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోకే విశ్వసనీయత
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

భీమునిపట్నం : భీమిలిలో గతంలో మంత్రిగా పని చేసినప్పుడు ఇష్టానుసారంగా అవినీతి, భూకబ్జాలకు పాల్పడిన టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఇప్పుడు మళ్లీ అందరినీ మోసం చేయడానికి సొంత మేనిఫెస్టో విడుదల చేశారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు కూటమి మేనిఫెస్టో నిండా సాధ్యం కాని హామీలుండగా... గంటాది అంతకు మించిపోయిందన్నారు. గంటా మంత్రిగా ఉన్నప్పుడు పద్మనాభం కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం, పాండ్రంగి బ్రిడ్జి, తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు ఇంకా అనేక హామీలిచ్చారని గుర్తు చేశారు. వాటిలో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయడంతో గతంలో పెండింగ్‌లో వుండిపోయిన పనులు జరుగుతున్నాయని, ఇంకా ఎన్నో పనులు పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో 33 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని తెలిపారు. సింహాచలం పంచగ్రామాల సమస్య కూడా త్వరలోనే పరిష్కారమయ్యే అవకాశం వుందన్నారు. పర్యాటకంగా విశాఖ, భీమిలి ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఎన్నో పనులు జరిగాయని, పర్యాటకులు కూడా అధిక సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాలు గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఏ స్థాయిలో మెరుగయ్యాయో ప్రత్యక్షంగా అందరూ చూస్తున్నారన్నారు. భీమిలి నియోజకవర్గం పరిధిలోనే 40 పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించామని తెలిపారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ అమలు చేశారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోకు విశ్వసనీయత వుందన్నారు.

'గంటా' భూదాహంతో భీమిలికి అప్రతిష్ట

గతంలో గంటా హయాంలో భూ ఆక్రమణలు, అక్రమాలు తప్ప ఇంకేమీ చెప్పుకునేందుకు లేవన్నారు. భూదాహంతో భీమిలిని అప్రతిష్ట పాలు జేశారని ఆరోపించారు. కనీస అభివృద్ధి జరగలేదని, ఎవరికీ అందుబాటులో కూడా లేరన్నారు. గంటా అనుచరులు కూడా ఇష్టం వచ్చినట్టు దండుకున్నారని, భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు. అంతలా అవినీతికి పాల్పడి ఇప్పుడు కొత్తగా ఏదో అద్భుతం చేస్తానని ప్రజలను నమ్మించడానికి మేనిఫెస్టో పేరుతో గంటా వస్తున్నాడన్నారు. దీన్ని నమ్మి ఓటు వేసి గెలిపిస్తే మళ్లీ ఐదు సంవత్సరాలు ఆయన ఎవరికీ అందుబాటులో వుండరని, ఈ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు. తాను అందరికీ అందుబాటులో వుండి పనులు చేస్తానని, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ గెలుపుతోనే అందరికీ మంచి జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోతోపాటు భీమిలి నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన మేనిఫెస్టోను విడుదల చేశారు. కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, దాట్ల పెదబాబు, అల్లిపిల్లి నర్సింగరావు, మైలిపల్లి షణ్ముఖరావు, ఎస్.కరుణాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఆశ్రమ వార్షికోత్సవం

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారంలో గల శ్రీ సద్గురు సేవా ఆశ్రమం 14వ వార్షికోత్సవం ఈ నెల 15 నుంచి 19 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు యోగారాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు రోజులపాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ముగింపు రోజున మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటేయండి


పొట్నూరులో వేతనదారులతో మాట్లాడుతున్న ముత్తంశెట్టి ప్రియాంక

పద్మనాభం : వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరుతూ జీవీఎంసీ చీఫ్ విప్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారుల వద్దకు గురువారం ఆమె వెళ్లి ప్రచారం చేశారు. సీఎం జగన్ ఐదేళ్ల సంక్షేమ పాలనలో అందరికీ మేలు జరిగిందని, జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పొట్నూరు, గంధవరం, అనంతవరం పంచాయతీల్లో నిర్వహించిన ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్‌లు గణపతిరాజు, మురళి, పల్లి గోవింద, బి.సత్యనారాయణ, కనిరెడ్డి చంద్రరావు, ప్రభాకర్, బేపల గురునాయుడు, అప్పారావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


రక్త పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

తగరపువలస : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎంఎస్‌వై కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి గంగునాయుడు ఆధ్వర్యంలో గర్భిణులకు గురువారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రసూతి వైద్య నిపుణురాలు సౌమ్య హైరిస్క్ గర్భిణులకు చికిత్సతోపాటు పలు సూచనలు చేశారు. మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 70 మంది ఈ సేవలు పొందారు. ఈ సందర్భంగా వైద్యుడు గంగునాయుడు మాట్లాడుతూ గర్భిణులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వైద్య సేవలు పొందాలన్నారు. అందరూ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గాయిత్రి వైద్య కళాశాల యాజమాన్యం అందరికీ ఉచితంగా ప్రొటీన్ పౌడర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్, పార్వతమ్మ, ఫార్మసిస్ట్ జయకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఈశ్వరరావు, వైద్య కళాశాల ప్రతినిధులు మామిడి పద్మారావు, కృష్ణంరాజు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే శిష్టకరణాలకు మేలు


శిష్టకరణాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : వైఎస్సార్‌సీపీతోనే శిష్టకరణాలకు మేలు జరిగిందని రాష్ట్ర శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కంఠిమహంతి అనూషా పట్నాయిక్ అన్నారు. గురువారం సాయంత్రం చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి డబ్బీరు ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన శిష్టకరణాల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. నిత్యం ప్రజల్లో వుండే ముఖ్యమంత్రి వైఎస్ జగన్, అందుబాటులో వుండే ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిష్టకరణాలకు ఆత్మీయులన్నారు. భావితరాలకు మేలు చేసే వైఎస్ జగన్‌మోహనరెడ్డి మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శనీయంగా నిలిచారన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన మానవతామూర్తి వైఎస్ జగన్ అని కొనియాడారు. ఆయనను మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే సంక్షేమ పథకాలు అందరికీ వస్తాయన్నారు. జగనన్న పాలనలో లబ్ధి పొందిన వారంతా ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భీమిలి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శిష్టకరణాల సంఘం జాతీయ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర సురేష్ బెనర్జీ, రాష్ట్ర కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అరికతోట చంద్రమౌళి, కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగూరి సీతారామదొర, శిల్లా కరుణాకరరెడ్డి, చిల్ల భాస్కరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఎదుటే స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడలేదేం..?


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- కూటమి నాయకుల మాటలు నమ్మొద్దు
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి


పీఎం పాలెం రోడ్డు షోలో నాయకులను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

మధురవాడ : తామే తలచుకుంటే స్టీల్‌ప్లాంట్‌ని పబ్లిక్ సెక్టార్‌లో ఉంచేయగలమ అంటున్న టీడీపీ నాయకులు మోదీ వచ్చినప్పుడు ఆ విషయంపై ఎందుకు మాట్లాడలేదని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ప్రశ్నించారు. గురువారం సాయంత్రం కార్‌షెడ్ నుంచి పీఎం పాలెం మీదుగా ఆర్‌హెచ్ కాలనీ - శంభువానిపాలెం - లక్ష్మీవానిపాలెం వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మంది బలిదానం వల్ల సాధించుకున్న స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం చేయడానికి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మోడీతో హామీ ఇప్పించలేకపోయారని, సెంటిమెంట్‌ను గౌరవించ లేకపోయారన్నారు. అటువంటి పార్టీలకు, అటువంటి పార్టీలతో జతకట్టే వారిని నమ్మితే స్టీల్‌ప్లాంట్ విక్రయించిన వారిమవుతామన్నారు. అటువంటి వారికి చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలతో నిత్యం మమేకమయ్యే ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును, విశాఖ ఆడపడుచునైన తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి గత అనుభవం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తాము గెలిచి విశాఖకి పరిపాలన రాజధానిని తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గాన్ని రూ.2,500 కోట్లతో అభివృద్ధి చేసినట్టు చెప్పారు. నిత్యం ప్రజల్లో వుంటూ అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన తనకు మరోసారి అవకాశమివ్వాలని కోరారు. గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే తమకు విజయాన్ని చేకూరుస్తాయన్నారు. నగర మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి వస్తేనే విశాఖ పరిపాలన రాజధాని అవుతుందని చెప్పారు. తద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని చెప్పారు. వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక పాల్గొన్నారు.

21న వృక్ష శాస్త్రంలో జాతీయ సదస్సు


సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగంలో ఈ నెల 21న నిర్వహించను న్న జాతీయ సదస్సు 'ఇంపాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ అండ్ ఎకోటూరిజం ఆన్ బయోడైవర్సిటీ' పోస్టర్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో సామాజిక భవనాలు

డెవలప్‌మెంట్ వాచ్


రూ.45.30 లక్షలతో నిర్మించిన సంతపేట డాక్టర్ అంబేద్కర్ సామాజిక భవనం


రూ.26 లక్షలతో గ్రంథాలయ వీధిలో నిర్మించిన సామాజిక భవనం


రూ.45.90 లక్షలతో దెక్కతిపాలెంలో నిర్మించిన సామాజిక భవనం


రూ.36.80 లక్షలతో చిట్టివలస పెరికివీధిలో నిర్మించిన సామాజిక భవనం

పేద ప్రజలు తమ ఇళ్లలో జరిగే సామాజిక ఫంక్షన్లు ఖరీదైన కల్యాణ మండపాల్లో వేలాది రూపాయల అద్దెలు చెల్లించుకుని నిర్వహించుకోలేరు. రోడ్లపై నిర్వహణకు ప్రకృతి సహకరించకపోవచ్చు. వీరిని దృష్టిలో పెట్టుకుని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతీ గ్రామానికి, సామాజిక వర్గానికి ఒక సామాజిక భవనాన్ని మంజూరు చేశారు. సంతపేట ఎస్సీ కాలనీలో రూ.32 లక్షలతో సామాజిక భవనాన్ని ఆధునీకీకరించారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్టపై రూ.70 లక్షలతో షాదీఖానాను పునర్నిర్మిస్తున్నారు. ఇవే కాకుండా పద్మనాభంలో నాగవంశీయులకు, మధురవాడలో నగరాలు కులస్థులకు చెరో అర ఎకరం స్థలంలో రూ.50 లక్షల వంతున వెచ్చించి కల్యాణమండపాల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదించింది.

– తగరపువలస

పద్మావతి అమ్మవారికి స్వర్ణ శఠగోపం బహూకరణ


ఈవో ధర్మారెడ్డికి బంగారు శఠగోపం అందజేస్తున్న దాత శేషు మస్తాన్‌రావు

ఎంవీపీ కాలనీ: విశాఖ కార్తీక దీపోత్సవం కార్యనిర్వాహక సభ్యుడు, దాత పువ్వాడ శేషు మస్తాన్‌రావు కుటుంబం పద్మావతి అమ్మవారికి రూ.26 లక్షలు విలువ చేసే బంగారు శఠగోపం బహూకరించింది. విశాఖ దీపోత్సవ కమిటీ ప్రతినిధి ఆధ్యాత్మిక వేత్త హిమ్మాన్షు ప్రసాద్ ఆధ్వర్యంలో మస్తాన్‌రావు కుటుంబ సభ్యులు తొలుత టీటీడీ ఈవో ధర్మారెడ్డిని కలిసి శఠగోపం అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావును ఈవో సత్కరించారు. అనంతరం తిరుచానూర్‌లో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులకు శఠగోపం అందజేశారు.

సీఎం జగన్‌ను దైవ సేవకులు ఆశీర్వదించండి

పాస్టర్లతో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

తగరపువలస : సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి అయ్యేందుకు దైవ సేవకులు ఆశీర్వాదాలు అందించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపంలో ఏపీ అండ్ తెలంగాణ పాస్టర్ల ఫెడరేషన్ చైర్మన్ ఆలీవర్ రాజు రాయి ఆధ్వర్యంలో భీమిలి నియోజకవర్గ పాస్టర్ల ఆత్మీయ సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ కులం, మతం, ప్రాంతం చూడకుండా అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పలువురు మైనారిటీలకు పదవులు కేటాయించారన్నారు. ప్రజల అండతోపాటు దేవుని దయ తనపైనా, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిపైనా ఉండేలా పాస్టర్లంతా నిత్య ప్రార్థనలు చేయాలని కోరారు. తమకు తెలిసిన క్రిస్టియన్ సోదరులతో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయించేందుకు సహకరించాలని కోరారు.

ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలుపును కోరుతూ పాస్టర్ శ్యాంబాబు ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అందరి వద్దకు వెళ్లి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో పాస్టర్లు జోసెఫ్ జేమ్స్, జయరాజ్, శామ్యూల్ సాంబ, ఫ్రాన్సిస్, వై.పాల్ రాజ్, జాన్ మేరీ, మోజెస్, అబ్రహం, ఆమోస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం


తగరపువలస : భీమిలి బ్యాంకు కాలనీలో ప్రచారంలో రెండో వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, చిల్ల ప్రమీల, చేట్ల ఢిల్లీశ్వరి, పల్లా వరలక్ష్మి, కనకమ్మ, దంతులూరి దేవి


కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు వారాహినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ముదుండు రాజేశ్వరి, నాయకులు


మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు పీఎంపాలెం అవంతి ఫంక్షన్ హాలు పరిసర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్న పిళ్లా సత్యనారాయణ, పిళ్లా సూరిబాబు, వాసు, హారిక, కొండమ్మ


మధురవాడ : స్వతంత్రనగర్‌లో ప్రచారం చేస్తున్న కాశ్మీర్ అప్పారావు, అప్పారావు, శశికిరణ్, ఉమాశంకర్


తగరపువలస : చిల్లపేటలో ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి

దేవీపురంలో ఆధ్యాత్మిక సందడి


అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సహస్రాక్షి అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని శ్రీయంత్ర మహామేరులోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి విశాఖలోని మల్కాపురం జనతా కాలనీ వాసులు గురువారం సారె తీసుకొచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మల్కాపురం జనతా కాలనీలో దేవీపురం గురూజీచే ప్రతిష్ఠించిన జయదుర్గా అమ్మవారికి ఏటా మే నెలలో నిర్వహించే వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఈ సారెను దేవీపురంలోని అమ్మవారికి సమర్పించడం అనవాయితీగా వస్తోంది. మేళతాళాలతో పల్లకీ ఉరేగింపుగా దేవీపురంలోని అమ్మవారికి బియ్యం,పండ్లు, చీర,సారె తీసుకొచ్చి శ్రీయంత్ర మహామేరులో కొలువైన అమ్మవారికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. సామూహికంగా లలితా ఖడ్గమాల, కుంకుమార్చనలు చేశారు. గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా పసుపు,కుంకుమలు,గాజులు,నూతన వస్త్రాలు అందుకొని తిరిగి ఊరేగింపుగా జయదుర్గ అమ్మవారితో తరలివెళ్లారు. సారె తీసుకొచ్చిన వారిలో కాలనీ వాసులు అప్పారావు,మరియదాసు,అప్పలరాజు,శివ కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.గురుమాత అన్నప్రసాద వితరణ చేపట్టి చిరు బహుమతులతో సత్కరించారు.